సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 27 । జూన్ । 2025



మొక్కుబడిగా..

ఉపాధి హామీ పనుల నిర్వహణపై ఏర్పాటు చేసిన సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం మొక్కుబడిగా సాగింది. 8లో ▸



కుక్కల దాడిలో..

యాచారం మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామంలో వీధి కుక్కల దాడిలో ఐదు మేకలు మృతి చెందాయి. 8లో ▸



మట్టి లారీల సీజ్

అధిక మట్టి లోడుతో వెళ్తున్న ఐదు లారీలను ఆర్టీఏ అధికారులు సీజ్ చేసిన సంఘటన ఇబ్రహీంపట్నంలో చోటు చేసుకుంది. 8లో ▸

న్యూస్‌రీల్

ప్రభుత్వ భూముల కబ్జాను సహించేది లేదు



అక్రమ నిర్మాణాల కూల్చివేత

తుర్కయంజాల్: ప్రభుత్వ భూములను కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఇంద్రాణి తెలిపారు. ఇంజాపూర్ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ సర్వే నంబర్ 199లో అక్రమంగా నిర్మించిన ఇళ్లను తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం కూల్చివేశారు. ఈ సందర్భంగా ఇంద్రాణి మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల జోలికి వస్తే ఎవరినీ వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది సంజీవ్ పాల్గొన్నారు.

అధిక ఫీజులను నియంత్రించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పుట్టా లక్ష్మణ్

షాద్‌నగర్: అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పుట్టా లక్ష్మణ్ డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం సంఘం జిల్లా సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టేషనరీ, పుస్తకాలు, డొనేషన్లు, ఫీజుల పేరుతో లక్షల రూపాయలు దండుకుంటున్నారని ఆరోపించారు. విద్యార్థుల తల్లిదండ్రుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్, నాయకులు మణికంఠ, అరుణ్, వినోద్, వంశీవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

హక్కుల కోసం మరో పోరాటానికి సిద్ధం



సమావేశమైన ఫార్మాసిటీ బాధిత రైతులు

యాచారం: మండలంలోని తాడిపర్తి, నక్కర్త మేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద గ్రామాలకు చెందిన ఫార్మాసిటీ భూ బాధిత రైతులు గురువారం సమావేశమయ్యారు. టీజీఐఐసీ పేరు తీసేసి రికార్డుల్లో రైతుల పేర్లు నమోదు చేయాలని హైకోర్టు స్పష్టమైన ఉత్తర్వులిచ్చినా అధికారుల్లో స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కులను ఎలా సాధించుకుందామని చర్చించారు. హైకోర్టు ఉత్తర్వులు, రికార్డుల్లో రైతుల పేర్లు నమోదు చేసి రైతు భరోసా కల్పించడం, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలు తదితర విషయాలపై సుదీర్ఘంగా చర్చించుకున్నారు. రైతుల హక్కుల కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు కవులు సరస్వతి, నారాయణ, నిరంజన్, వినోద్‌రెడ్డి, గణేశ్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యాయం చేయండి



తుర్కయంజాల్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇంజాపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 383లో హెచ్ఎండీఏ వెంచర్ ఏర్పాటు కోసం భూమి ఇచ్చిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు. వెంచర్‌లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటూ ఉపాధి పొందుతున్న భూమిని కోల్పోయినందుకుగాను 100 మంది రైతులకు 300 గజాల చొప్పున ప్లాట్ కేటాయిస్తున్నట్లు అప్పటి ఆర్‌డీఓ, తహసీల్దార్ పత్రాలు అందజేశారని తెలిపారు. అప్పట్లో ముగ్గురికి మాత్రమే రిజిస్ట్రేషన్ చేశారని, మిగతా వారిని అలానే వదిలేశారన్నారు. నాలుగేళ్లు గడుస్తున్నా నేటికీ రిజిస్ట్రేషన్ చేయకుండా కాలాయపన చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఆర్డీఓ, తహసీల్దార్‌ను కలవగా ఫైల్ తమ వద్ద లేదని, తాము ఏమీ చేయలేమని చెబుతున్నారని వాపోయారు. అధికారులు వెంటనే స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



కడ్తాల్: డ్రగ్స్‌కు వ్యతిరేకంగా మానవహారం, ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసులు



మొయినాబాద్‌రూరల్: చేవెళ్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు


డ్రగ్స్ వద్దు.. జీవితం ముద్దు

అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లాలో ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలను, భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని వక్తలు సూచించారు. మాదక ద్రవ్యాలను అరికట్టాడానికి ప్రతి ఒక్కరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు.

మూగ వేదన!

- మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- అందుబాటులో ఉండని పశువైద్యులు
- వ్యాక్సిన్లు వేయకున్నా వేసినట్లు రికార్డులు
- ప్రభుత్వ ఆస్పత్రిలో జీతం.. ప్రైవేటులో విధులు

సుస్తీ చేసిన పశువులకు చికిత్స కరువు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: పశువులకు సుస్తీ చేస్తే సరైన చికిత్స అందక మూగ వేదన అనుభవిస్తున్నాయి. వివిధ రకాల వ్యాధులతో మృత్యువాతపడుతున్నాయి. వాటినే జీవనాధారంగా జీవనం సాగిస్తున్న రైతులకు తీరని శోకం మిగుల్చుతున్నాయి. ప్రభుత్వ ప్రాథమిక పశు వైద్య కేంద్రాల్లో పశువైద్యులు నిత్యం అందుబాటులో ఉండాలి. ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటించి, సీజన్ల వారీగా పశువులకు వచ్చే గాలికుంటు, ముద్ద చర్మ వ్యాధులు, పీపీఆర్(పారుడు), నట్టలతో వచ్చే జబ్బులపై అవగాహన కల్పించాలి. కొంత మంది వైద్యులు రోజుల తరబడి పశువైద్య కేంద్రాల ముఖం కూడా చూడడం లేదు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని అభాసుపాలు చేస్తున్నారు. వ్యాక్సిన్లు వేయకుండానే వేసినట్లు రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి ఇటీవల చేపట్టిన వరుస తనిఖీల్లో విస్తుగొలిపే అంశాలు వెలుగుచూశాయి.

ఆస్పత్రుల ముఖం చూడని వైద్యులు

జిల్లాలో 10,31,460 పశువులు, 2,40,69,700 కోళ్లు, 1.67 లక్షల గేదెలు, 7,67,125 మేకలు, 2,56,632 గొర్రెలు, 6,076 పందులు, 1,535 గుర్రాలు, 16 గాడిదలు, 27,200 కుక్కలు, 2,947 కుందేళ్లు ఉన్నట్లు అంచనా. సీజన్ మారిన సమయాల్లో పశువులు పలు వ్యాధుల బారినపడుతుంటాయి. వాటికి సత్వర చికిత్స కోసం ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా నాలుగు ఏరియా వెటర్నరీ ఆస్పత్రులు, 46 ప్రాథమిక కేంద్రాలు, ఐదు మొబైల్ క్లినిక్స్, 87 సబ్ సెంటర్లను ఏర్పాటు చేసింది. ఆరుగురు సహాయ సంచాలకులతో పాటు 48 మంది పశు వైద్య సహాయ శస్త్రచికిత్సకులు, 16 మంది వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్లు, 31 మంది జూనియర్ వెటర్నరీ ఆఫీసర్లు, 53 మంది లైవ్‌స్టాక్ అసిస్టెంట్లు, 37 మంది వెటర్నరీ అసిస్టెంట్లు, 117 మంది ఆఫీసు సబార్డినేటర్లను నియమించింది. వీరంతా నిత్యం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆయా పశువైద్య కేంద్రాల్లో అందుబాటులో ఉండాలి. మెజార్టీ పశువైద్యులు ఆస్పత్రులకు రావడం లేదు.



అధికారుల తనిఖీ సమయంలో మూసి ఉన్న హైదర్‌గూడలోని పశువైద్య కేంద్రం

మచ్చుకు కొన్ని..

- కొందుర్గు ప్రాథమిక వెటర్నరీ క్లినిక్ వైద్యుడు ప్రభుత్వ పశువైద్యశాలలో కంటే.. తన ప్రైవేటు క్లినిక్‌లోనే ఎక్కువ ఉంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తరచూ విధులకు గైర్హాజరవుతుండడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. ఉన్నతాధికారుల తనిఖీల్లో ఇదే అంశం స్పష్టమైంది.
- కనకమామిడి ప్రాథమిక వెటర్నరీ క్లినిక్ వైద్యుడిది సైతం ఇదే ధోరణి.
- ఆమనగల్లు వెటర్నరీ క్లినిక్‌లో పశువులకు చేసిన వైద్య పరీక్షలు, అందించిన చికిత్సల వివరాలు వైద్యుడు రాకపోవడంతో కిందిస్థాయి సిబ్బందే రికార్డు చేస్తుండటం విశేషం. బక్రీద్ విధుల్లో భాగంగా ఇక్కడి వైద్యుడికి శంకర్‌పల్లిలో డ్యూటీ వేయగా అంతదూరం వెళ్లనని చెప్పి, తర్వాత అదనపు డైరెక్టర్ ఆర్డర్‌ను సైతం ట్యాంపరింగ్ చేసి తనకు అనుకూలమైన ప్రాంతానికి వెళ్లినట్లు తెలిసింది.

వ్యాక్సిన్ సీలు కూడా తీయకుండా..

గాలికుంటు వ్యాధి రహిత దేశంగా గుర్తింపు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గాలికుంటు వ్యాధి నిరోధక (ఎఫ్ అండ్ ఎండీ) టీకాల కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇందుకు ఏటా రూ.40 లక్షల వరకు ఖర్చు చేస్తోంది. హైదర్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పశువైద్య కేంద్రం(పీవీసీ)లోని వైద్య సిబ్బంది వ్యాక్సిన్ వేయకుండానే వేసినట్లు రికార్డు చేశారు. ఈ సెంటర్‌కు 110 ఎఫ్ఎండీసీ వ్యాక్సిన్ బాటిళ్లను సరఫరా చేయగా, ఒక్కో బాటిల్ 50 పశువుల చొప్పున 5,249 పశువులకు వ్యాక్సిన్ వేసినట్లు రాశారు. ఏ ఒక్క దానికీ వ్యాక్సిన్ వేయలేదు. సీల్ కూడా తీయని 25 బాటిళ్లను ఇటీవల తనిఖీ కోసం వచ్చిన జిల్లా అధికారి గుర్తించి స్వాధీనం చేసుకోవడం విశేషం. ఇక ఒక బాటిల్ 30 పశువులకు మాత్రమే వచ్చే బ్లాక్ వాటర్ వ్యాక్సిన్‌ను ఏకంగా 134 పశువులకు వేసినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. ఇచ్చిన మూడు బాటిళ్లలో సీల్‌కూడా తీయని రెండు బాటిళ్లు అక్కడే ఉన్నాయి. ఆయా బాటిళ్లను జిల్లా అధికారి ఇటీవల సీజ్ చేశారు. తనిఖీ సమయంలో ఆస్పత్రికి తాళం వేసినట్లు గుర్తించి, సదరు వైద్యురాలిని హెచ్చరించారు. వరుస తనిఖీలతో హడలెత్తించిన సదరు జిల్లా వైద్యాధికారిపై కొంత మంది ఉద్దేశపూర్వకగా ఆశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి బదిలీ చేయించారు. ఈ అంశాన్ని కలెక్టర్ సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది.



కరపత్రం ఆవిష్కరిస్తున్న డీటీఎఫ్ నాయకులు

ప్రభుత్వ విద్యను పరిరక్షించాలి

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ విద్యను విధ్వంసం చేసేందుకు పన్నుతున్న కుట్రలను ఆపాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యాపరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్కువద్ద శుక్రవారం చేపట్టనున్న ధర్నా కరపత్రాన్ని గురువారం పట్టణంలోని ఎంఈఓ కార్యాలయం ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ.. సర్కారు బడులను బలోపేతం చేసేందుకు అధిక నిధులు కేటాయించాలని అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో 10 శాతం నిధులు కేటాయించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న డీఈఓ, డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఆడిట్ కన్వీనర్ రవీంద్రనాథ్, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, తెలంగాణ ప్రజాఫ్రంట్ నాయకుడు అర్జునప్ప తదితరులు పాల్గొన్నారు.

కొండంత బోనం.. కోటంత సంబురం



గోల్కొండ కోట ఆధ్యాత్మిక పరిమళాలతో అలరారింది. పోతురాజుల విన్యాసాలు.. శివసత్తుల పూనకాలతో పరవశించింది. ఆషాఢ మాసం బోనాల జాతరలో భాగంగా గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారికి గురువారం తొలి బోనం పూజ ఘనంగా జరిగింది. ఆషాఢ మాసంలో గురు, ఆదివారాల్లో జరిగే మొత్తం తొమ్మిది బోనాల ఉత్సవాలకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. మొదటి వారం బోనాల జాతరకు వీఐపీలతో పాటు భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. గోల్కొండ ఫతేదర్వాజా నుంచి ఘటాల ఊరేగింపు ముందుకు సాగింది.

– సాక్షి, సిటీబ్యూరో

క్షయవ్యాధి నిర్మూలనే ధ్యేయం



అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు

షాద్‌నగర్‌రూరల్: క్షయవ్యాధిని నిర్మూలించడమే ప్రభుత్వ ధ్యేయమని హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్టలో గురువారం చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు స్రవంతి ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓపీ, హెచ్ఐవీ, ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. అనంతరం హెల్త్ ఎడ్యుకేటర్ మాట్లాడుతూ.. టీబీ లక్షణాలు ఉన్నవారు వెంటనే గల్ల పరీక్ష, ఎక్స్‌రే తీయించుకోవాలని తెలిపారు. ఈ పరీక్షలు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా చేస్తారన్నారు. టీబీ ఉన్నట్లు నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం మందులను ఉచితంగా ఇస్తుందని, క్రమం తప్పకుండా ఆరు నెలలు వాడితే వ్యాధి నయమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ, డాక్టర్ విజయలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్లు, టీబీ సూపర్‌వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పోలీస్ పహారాలో ఎనికేపల్లి



ఎనికేపల్లి భూముల వద్ద పహారా కాస్తున్న పోలీసులు

- సర్వే చేసేందుకు వచ్చిన హెచ్ఎండీఏ అధికారులు
- విషయం తెలిసి అక్కడికి చేరుకున్న రైతులు
- అడ్డుకుని వెనక్కి పంపించిన పోలీసులు
- ఎమ్మెల్యే, కలెక్టర్‌ను కలిసిన బాధితులు
- ఎటూ తేలని పరిహారం విషయం



భూముల వద్ద కూర్చొని రోదిస్తున్న మహిళా రైతులు

మొయినాబాద్: గోశాల ఏర్పాటుకు కేటాయించిన ఎనికేపల్లి భూముల్లో పోలీస్ పహారా కొనసాగుతోంది. సర్వేనంబర్ 180లోని 99.14 ఎకరాల భూమిని ప్రభుత్వం గోశాల ఏర్పాటుకు కేటాయించిన విషయం తెలిసిందే. ఏడు దశాబ్దాలుగా భూములు సాగుచేసుకుంటున్న రైతులకు పరిహారం ఇస్తామని చెప్పిన అధికారులు పూర్తిస్థాయిలో పరిష్కరించలేదు. ఈ క్రమంలో గురువారం ఉదయం హెచ్ఎండీఏ అధికారులు భూములు సర్వే చేసేందుకు వచ్చారు. విషయం తెలుసుకున్న కొంతమంది రైతులు అక్కడికి చేరుకున్నారు. మహిళా రైతులు అక్కడే కూర్చొని రోదిస్తూ నిరసన వ్యక్తం చేశారు. భూముల్లోకి ఎవరినీ వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకుని అక్కడి నుంచి పంపించారు. హెచ్ఎండీఏ అధికారులు సర్వే చేయకుండానే వెనుతిరిగారు. పోలీసుల పహారా సాయంత్రం వరకు కొనసాగింది.

ఎమ్మెల్యే యాదయ్యను కలిసిన రైతులు

భూములు కోల్పోతున్న రైతులు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను ఆయన నివాసంలో కలిశారు. తమకు ప్రభుత్వం ఇచ్చే పరిహారం పెంచాలని.. ఎకరాకు సుమారు వెయ్యి గజాల స్థలాన్ని ఇవ్వాలని కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే కలెక్టర్ నారాయణరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం రైతులను తీసుకుని కలెక్టర్ వద్దకు వెళ్లారు. ఎకరాకు 800 గజాల స్థలాన్ని ఇవ్వాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అంత ఇవ్వలేమని ప్రభుత్వ నిబంధనల ప్రకారం 200 గజాలు ఇస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. కనీసం 400 గజాలైనా ఇవ్వాలని కోరగా అంత ఇవ్వలేమని కలెక్టర్ తేల్చి చెప్పారు. దీంతో మీపని మీరు చేసుకోండి.. వారిపని వారు చేసుకుంటారని చెప్పి ఎమ్మెల్యే వెళ్లిపోయారు. పరిహారం విషయం ఎటూ తేలలేదు.



సీజ్ చేసిన మట్టి లోడ్ వాహనాలతో ఆర్టీఏ సిబ్బంది

మట్టి లారీల సీజ్

ఇబ్రహీంపట్నం: అధిక మట్టి లోడుతో వెళ్తున్న ఐదు లారీలను ఆర్టీఏ అధికారులు సీజ్ చేసిన సంఘటన ఇబ్రహీంపట్నంలో చోటు చేసుకుంది. ప్రాంతీయ రవాణా కార్యాలయ అధికారి(ఆర్టీఓ) సుభాష్ చంద్రరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో సమీపంలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు సుశీల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలు తనిఖీలు చేపట్టారు. అధిక లోడ్‌తో మట్టిని తరలించడమేగాక, మట్టిపై ఎలాంటి కవర్ వేయకుండా తోటి వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్న ఐదు టిప్పర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. వాహనాలను తాత్కాలికంగా ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో ఉంచారు.

లోడ్‌పై కవర్ కప్పాలి

వాహనాల్లో తరలించే మట్టి లోడ్‌పై తప్పని సరిగా కవర్లను కప్పాలని ఆర్టీవో సూచించారు. కవర్స్ కప్పక పోవడంతో ఆ వాహనాల నుంచి మట్టి ఎగిరిపడుతూ వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగజేస్తుందన్నారు. అధిక లోడ్‌తో వెళ్లే వాహనాలపై చట్టరీత్యా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

ఇంటి నుంచి బయటకు వెళ్లి

వేర్వేరు చోట్ల ఇద్దరు మహిళల అదృశ్యం



రజిత (ఫైల్)

పహాడీషరీఫ్: యువతి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ దయాకర్‌రెడ్డి గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. తుక్కుగూడ గ్రామానికి చెందిన జర్పుల దేశ్య కుమార్తె రజిత(26) ప్రైవేట్ ఉద్యోగి. ఈ నెల 25వ తేదీన మధ్యాహ్నం ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. ఆచూకీ కోసం సాధ్యమైన ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకుండా పోయింది. ఆమె తల్లి సీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 62367 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

షాబాద్‌లో వివాహిత..



స్వాతి (ఫైల్)

షాబాద్: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ గ్రామానికి చెందిన సొన్నాయిల స్వాతి ఈ నెల 22వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు ఆమె కోసం బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం ఆమె భర్త నరేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే వెంటనే 99897 92750 నంబరుకు సమాచారం అందించాలని సూచించారు.

ప్రమాద బాధితురాలి పరిస్థితి విషమం

మొయినాబాద్: రోడ్డు ప్రమాదంలో బుధవారం తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు లక్ష్మి ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. బుధవారం మొయినాబాద్ మండల పరిధిలోని రెడ్డిపల్లి సమీపంలో అతివేగంతో వెళ్తున్న కారు ఎదురుగా వచ్చిన స్కూటీని ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతి చెందగా ఓ మహిళ గాయపడిన విషయం తెలిసిందే. ప్రమాదానికి ప్రధాన కారణం అతివేగమేనని గుర్తించిన పోలీసులు, కారు నడిపిన వ్యక్తిని పిలిచి విచారించారు. ఎగుడు దిగుడుగా ఉన్న రోడ్డులో కారు బ్రేక్ తొక్కబోయి యాక్సిలరేటర్ తొక్కడంతోనే ప్రమాదం జరిగినట్లు తెలిసింది.

ఇల్లు అద్దెకు కావాలని వచ్చి..

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

పహాడీషరీఫ్: ఇల్లు అద్దెకు కావాలంటూ వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని యువకులు మహిళ మెడలోని బంగారు గొలుసును తెంచుకొని ఉడాయించిన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ గ్రామంలోని అంజిరెడ్డి కాలనీకి చెందిన యాదమ్మ(58) గురువారం మధ్యాహ్నం ఇంటి ముందు కూర్చొంది. ఇల్లు అద్దెకు కావాలని వచ్చిన ఇద్దరు యువకులు, ఆమెను మాటల్లో దింపి మెడలోని నాలుగు తులాల పుస్తెల తాడును తెంచుకొని పరారయ్యారు. పల్సర్ బైక్‌పై వచ్చిన నిందితులలో వెనుక కూర్చొన్న వ్యక్తి హెల్మెట్ ధరించి ఉన్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

సునీల్ శెట్టి @187!



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

మళ్లీ చిక్కిన ఘరానా దొంగ మహ్మద్ సలీం

- 1991 నుంచి నేర ప్రస్థానం.. 187 కేసులు
- చోరీ సొమ్ముతో హెలీటూరిజం చేసిన చరిత్ర
- గురువారం అరెస్టు చేసిన బండ్లగూడ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో/పహాడీషరీఫ్: అసలు పేరు మహ్మద్ సలీం... మారు పేరు సునీల్‌శెట్టి... సొంత దుకాణం నుంచే చోరీలు ప్రారంభించాడు... 34 ఏళ్ల నేర ప్రస్థానంలో 187 చోరీలు చేశాడు... ఇప్పటి వరకు 25 సార్లు అరెస్టై కటకటాల్లోకి వెళ్లాడు... 'పీడీ'కి దొరక్కుండా జాగ్రత్తపడే సునీల్ గత నెల 5న జైలు నుంచి బయటకు వచ్చాడు... మరో రెండు నేరాలు చేసి బండ్లగూడ పోలీసులకు చిక్కాడు. చోరీ సొత్తుతో ఉత్తరాదిలో జల్సాలతో పాటు హెలీటూరిజం ఈ సునీల్ శెట్టి నైజం. ఈ ఘరానా దొంగను బండ్లగూడ పోలీసులు అరెస్టు చేసినట్లు చంద్రాయణగుట్ట ఏసీపీ ఎ.సుధాకర్ గురువారం వెల్లడించారు.

మార్చిన 'ఆమె' పరిచయం...

ఫతేదర్వాజా సమీపంలోని కుమ్మరివాడికి చెందిన సలీం నిరక్షరాస్యుడు. తొలుత కిరోసిన్ లాంతర్ల కర్మాగారంలో పనివాడిగా చేరాడు. ఆపై తన తండ్రికి చెందిన కిరాణా దుకాణంలోనే పని చేయడం మొదలెట్టాడు. సలీంకు 16వ ఏట ఓ అమ్మాయితో అయిన పరిచయం ప్రేమకు దారి తీసింది. ఆమెతో కలిసి షికార్లు చేయడానికి అవసరమైన ఖర్చుల కోసం తమ దుకాణంలోనే చోరీలు చేయడం మొదలెట్టాడు. ఈ విషయం బయటకు పొక్కేసరికి ఇల్లు వదిలి పారిపోయి చాదర్‌ఘాట్‌లోని ఓ హోటల్‌లో కార్మికుడిగా మారాడు. ఈ పని చేస్తూనే అవకాశం చిక్కినప్పుడల్లా చిన్న చిన్న గృహోపకరణాలు తస్కరించడం మొదలెట్టాడు. 1991లో ఇతడి 18వ ఏట ఇత్తడి వస్తువుల చోరీ కేసులో తొలిసారిగా చాదర్‌ఘాట్ పోలీసులకు చిక్కి జైలుకు వెళ్లాడు.



మహ్మద్ సలీం

జైల్లో పరిచయమైన 'సీనియర్ల' వద్ద తాళాలు పగులకొట్టడంతో మెళకువలు నేర్చుకున్నాడు.

ఇంటి తాళం ముట్టనే ముట్టడు...

ఈ చోరుడు ప్రధానంగా పాతబస్తీలోని ఓ వర్గానికి చెందిన వారి ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుంటాడు. ఆ ప్రాంతాల్లోని ప్రజలు సాధారణంగా తెల్లవారు జాము 3 గంటల వరకు మెలకువగానే ఉంటారు. అందుకే ఇతగాడు తెల్లవారుజాము 4 గంటల తర్వాతే చోరీ చేస్తాడు. అప్పటి వరకు నిద్రరాకుండా ఉండేందుకు తన స్మార్ట్‌ఫోన్‌లో లూడో, క్రికెట్ ఆడుతూ టైమ్‌పాస్ చేస్తాడు. చిన్న టార్చ్‌లైట్, కటింగ్ ప్లేయర్‌తో 'రంగం'లోకి దిగే ఇతగాడు ప్రధానంగా మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి వర్గాలకు చెందిన ఇళ్లనే ఎంచుకుంటాడు. తాళం వేసున్న ఇంటిని టార్గెట్ చేసినప్పటికీ ఎట్టి పరిస్థితుల్లోనూ దాన్ని పగులకొట్టడు. గోడ దూకి సజ్జ ద్వారా ఇంటి పైకి చేరతాడు. అక్కడ నుంచి ఇంట్లోకి చేరే మార్గం వెతుక్కుని ప్రవేశిస్తాడు. ఇతగాడు చోరీ చేసే సమయంలో పెట్రోలింగ్ వాహనాలు ఆ ప్రాంతానికి వచ్చినా ఇంటి తాళం యథాతథంగా ఉండటంతో వారు దృష్టిపెట్టరని ఇలా చేస్తుంటాడు. లోపలకు వెళ్లాక చెంచాల సహా అక్కడ ఉన్న ఉపకరణాలతోనే అల్మారాలు పగులకొట్టి సొత్తు స్వాహా చేస్తాడు. 1998లో ముగ్గురు సంతానం ఉన్న ఓ వితంతువును వివాహం చేసుకున్న ఈ సునీల్ శెట్టి ఇప్పుడు ఏడుగురి పిల్లలకు తండ్రి.

ఈ దొంగనే దోచిన 'దొంగది'...

ఈ సొత్తు విక్రయించగా వచ్చిన సొమ్ముతో ముంబై, అజ్మీర్ సహా ఉత్తరాదిలో జల్సాలు చేస్తుంటాడు. సైట్ సీయింగ్‌తో పాటు హెలికాప్టర్‌లో సంచరించే హెలీటూరిజం కోసం భారీ ఖర్చు చేస్తాడు. వ్యభిచారిణుల వద్దకు వెళ్ళే అలవాటు ఉన్న సలీం ఓసారి రూ.12 లక్షల చోరీ సొత్తుతో ముంబైలోని ఓ మహిళ వద్దకు వెళ్లాడు. ఇతడు నిద్రపోతున్న సమయంలో ఆ సొత్తు కాజేసిన ఆమె ఉడాయించింది. బాలీవుడ్ నటుడు సునీల్‌శెట్టి అంటే అమితంగా ఇష్టపడే సలీం తన పేరునూ అలానే మార్చుకున్నాడు. ముంబైలోని బాంద్రాలో ఉన్న ఆ హీరో ఇంటి వద్దకు అనేకసార్లు వెళ్లినా కలవడం సాధ్యం కాలేదు. ఇప్పటి వరకు 187 నేరాలు చేసి 25సార్లు అరెస్టు అయినా... శిక్షలు పూర్తయ్యే వరకు జైలు నుంచి బయటకు రాని నేపథ్యంలోనే ఇతడిపై పీడీ యాక్ట్ ప్రయోగం సాధ్యం కాలేదు. గత నెల్లో జైలు నుంచి బయటకు వచ్చిన ఈ సునీల్ శెట్టి బండ్లగూడ పరిధిలో రెండు నేరాలు చేశాడు. ఈ నేరాల్లో ఇతడిని అరెస్టు చేసిన పోలీసులు 35 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. సునీల్ శెట్టిని అరెస్టు చేసిన పోలీసులను డీసీపీ ఎస్.చైతన్యకుమార్ అభినందించారు.

ఉద్యోగం చేస్తూ పీహెచ్‌డీ పట్టా



ప్రతిభ చాటిన నంద్యాతండావాసి రాజునాయక్

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం నంద్యా తండాకు చెందిన రాజునాయక్ పీహెచ్‌డీ పట్టా పొందారు. లక్ష్మి, బొట్యానాయక్ దంపతులకు జన్మించిన ఆయన పదో తరగతి వరకు పరిసర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. మిగతా చదువులు కూడా సర్కారు కళాశాలలోనే పూర్తి చేశాడు. డిగ్రీ అనంతరం 2019 ఏప్రిల్ 11న జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఎల్కగూడ పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం ఫరూఖ్‌నగర్ మండలం కంసాన్‌పల్లి కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఓ వైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు తన విద్యాభ్యాసం కొనసాగించారు. 'ట్రైబల్ డెవలప్‌మెంట్ అండ్ నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్, ఏ స్టడీ ఆఫ్ మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ ఇన్ తెలంగాణ స్టేట్' అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ బ్రహ్మానందం పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఇందుకుగాను గురువారం యూనివర్సిటీ అధికారుల చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా రాజునాయక్‌ను మండల వాసులు అభినందించారు.

పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్‌గా ప్రాణేశ్‌కుమార్



కద్తాల్: మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రం నూతన మేనేజర్‌గా ప్రాణేశ్‌కుమార్ నియమితులయ్యారు.ఈ మేరకు గురువారం పాలశీతలీకరణ కేంద్రంలోని కార్యాలయంలో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించారు. గత కొంత కాలంగా పాలశీతలీకరణ కేంద్రానికి మేనేజర్ లేక పోవడంతో, ఇన్‌చార్జి మేనేజర్‌గా ఉదయశ్రీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ పాడి పారిశ్రామిభివృద్ధి సహకార సమాఖ్య ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, మహబూబ్‌నగర్ పాలశీతలీకరణ కేంద్రం నుండి ప్రాణేశ్‌కుమార్ బదిలీపై కద్తాల్ పాలశీతలీకరణ కేంద్రానికి రావడం జరిగింది.ఈ సందర్భంగా ప్రాణేశ్‌కుమార్ మాట్లాడుతూ, పాలశీతలీకరణ కేంద్రం పరిధిలో రైతులు నాణ్యమైన పాలను పోసి, అధిక ధరలను పొందాలని సూచించారు. పాలసేకరణ దారులు కూడ పాడి రైతులకు అవగాహన కల్పించి, నాణ్యమైన పాలను సేకరించాలని కోరారు. పాడి రైతులకు అందుబాటులో ఉండి పాడి రైతుల సమస్యల పరిష్కారాని కృషి చేస్తానని తెలిపారు.

కుక్కల దాడిలో ఐదు మేకల మృతి



మేకల కళేబరాలు

యాచారం: మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామంలో వీధి కుక్కల దాడిలో ఐదు మేకలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన అనేమోని రవీందర్ గురువారం మధ్యాహ్నం తన మేకలను పొలంలో మేపుతున్నాడు. గ్రామంలో ఉన్న వీధి కుక్కలు గుంపులుగా వచ్చి మేకలపై దాడి చేసి గాయపర్చడంతో ఐదు అక్కడికక్కడే మృతి చెందాయి. దాదాపు రూ.లక్షకు పైగా నష్టం జరిగిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని పౌల్ట్రీఫాంల యజమానులు మృతి చెందిన కోళ్ల కళేబరాలను పొలంలో ఇష్టానుసారంగా పడేయడంతో వాటిని తింటున్న వీధి కుక్కలు మాంసం రుచి మరిగి జీవాలపై దాడులు చేస్తున్నాయని వాపోతున్నారు.

హైడ్రా పేరుతో బెదిరింపులు

నార్సింగి పీఎస్‌లో ఇద్దరిపై కేసు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) పేరు చెప్పి బెదిరించిన ఇద్దరిపై నార్సింగి పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. కరీంనగర్ నుంచి వచ్చి కారుడ్రైవర్‌గా పని చేస్తున్న మిరియాల వేదాంతం అల్కాపురి టౌన్‌షిప్‌లో నివసిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఈ ద్వయం నెక్నాంపూర్‌లోని అల్కాపూర్ టౌన్‌షిప్‌లో ఉన్న ఓ ఇంటి వద్దకు వెళ్లింది. నలుపు రంగు కారులో వచ్చిన వీరిద్దరూ ఆ ఇంటి ఆవరణలోకి వెళ్లి పరిశీలిస్తుండగా గమనించిన ఇంటి వద్ద పని చేసే గుంతకల్ మల్లికార్జున్ వారిని ఎవరంటూ ప్రశ్నించారు. తాము హైడ్రా నుంచి వచ్చామని చెప్పిన ద్వయం ఆ ఇంటిని కూల్చేస్తామని, దానికి సంబంధించిన సమాచారం సేకరిస్తున్నామని చెప్పారు. దీంతో మల్లికార్జున్ ఈ విషయంపై ఇంటి యజమానితో మాట్లాడాలని సూచించగా అక్కడ నుంచి జారుకున్నారు. ఈ మేరకు మల్లికార్జున్ నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. దర్యాప్తు చేసిన అధికారులు ఇరువురినీ కస్టడీలోకి తీసుకున్నారు. హైడ్రా పేరు చెప్పి ఎవరైనా మోసాలకు, బెదిరింపులకు పాల్పడితే వెంటనే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని హైడ్రా గురువారం ఒక ప్రకటనలో కోరింది. ఇలాంటి వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని, నేరుగా తమకు ఆ సమాచారం ఇచ్చినా వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఏదైనా విషయంపై హైడ్రా ఉద్యోగులు విచారణ చేపడితే... అడిగిన వారికి పూర్తి వివరాలు అందిస్తారని పేర్కొంది. హైడ్రా ఉద్యోగుల్లో ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడినా, హైడ్రా పేరును దుర్వినియోగం చేసినా వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. ఇలాంటి బెదిరింపు వ్యవహారాలు గమనిస్తే 8712406899 నంబరుకు ఫోను చేసి లేదా వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వాలని కోరింది. వీలుంటే వీరి ఫొటోలు కూడా షేర్ చేయాలని పేర్కొంది.

జాతీయ స్థాయి శిక్షణకు ఎంపిక

పూడూరు: కంకల్ పాఠశాల ఉపాధ్యాయుడు ఈశ్వరరావు జాతీయ స్థాయి శిక్షణకు ఎంకయ్యారని మండల విద్యాధికారి సాయిరెడ్డి తెలిపారు. రాష్ట్ర స్థాయి విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనలో సత్తాచాటారన్నారు. నూతన అభ్యసన ప్రక్రియలకు సంబంధించి అన్ని జిల్లాల నుంచి ప్రదర్శనలు రాగా ఉత్తమ ప్రదర్శన అందించిన ఉపాధ్యాయులను జాయతీ స్థాయికి ఎంపిక చేశారన్నాని స్పష్టంచేశారు. వీరు జూలై 3నుంచి 17వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించే శిక్షణలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా గురువారం కాంప్లెక్స్ హెచ్‌ఎం పుష్ప, లక్ష్మణ్, ఉపాధ్యాయులు ఈశ్వరరావును సన్మానించారు.

మొక్కుబడిగా సామాజిక తనిఖీ

- రికార్డుల నిర్వహణలో అవకతవకలు
- సమావేశంలో డీఆర్‌డీఓ శ్రీలత



ప్రజావేదికలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శ్రీలత

మంచాల: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల నిర్వహణపై మంచాలలో ఏర్పాటు చేసిన సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం గురువారం మొక్కుబడిగా సాగింది. ప్రజలు ఎవరూ హాజరు కాకపోవడంతో అధికారులు, సోషల్ ఆడిట్ సిబ్బందితోనే కార్యక్రమం ముగిసింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో ఉపాధి హామీ పథకం కింద రూ.3.51 కోట్లు, అటవీ శాఖ ఆధ్వర్యంలో రూ. 2.32 కోట్లు, పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.1.71 కోట్లు పని జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ పనుల నిర్వహణపై ప్రజా వేదికను డీఆర్‌డీఓ శ్రీలత ఆధ్వర్యంలో నిర్వహించారు. పనుల కొలతల్లో తేడాలు, బినామీల పేర్లతో పనులు చేసినట్లు తెలిసింది. పనుల వివరాలను రికార్డు నమోదు కూడా సక్రమంగా చేయలేదని తేలింది. ప్రధానంగా పని చేయని వారి పేర్ల మీద పని చేసినట్లు హాజరు నమోదైంది. ఈసీ ఫీల్డ్ విజిట్ చేయకుండా మంచాలలో నెల రాక ముందే రికార్డులు నమోదు చేశారు. ఏపీఓ సంతకాలు లేకుండా మస్టర్లు తయారు చేశారని ఆరోపించారు. రంగాపూర్ నర్సరీలో 40 వేల మొక్కలు ఎక్కడ నాటారనే విషయంలో స్పష్టత లేదు. అనంతరం డీఆర్‌డీఓ కల్పించుకొని.. కచ్చితంగా నర్సరీలలో పెంచిన మొక్కలు గ్రామంలో ఎక్కడెక్కడ నాటారో రికార్డు చేయాలన్నారు. కొన్ని గ్రామాల్లో మస్టర్ పూర్తి చేసిన అనంతరం తిరిగి రాశారని సామాజిక తనిఖీ బృందం ఆరోపించింది. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ సుభాషిణి, ఎంపీడీఓ బాలశంకర్, అంబుడ్స్‌మెన్ సునీత, విజిలెన్స్ అధికారి కొండయ్య, ఏపీడీ చరణ్ గౌతమ్, సామాజిక తనిఖీ అధికారి అంజయ్యగౌడ్, ఎంపీఓ ఉమారాణి, ఏపీఓ వీరాంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

జేసీబీతో పని పేరిట మోసం



అరెస్ట్ చూపుతున్న సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి

- తంగళ్లపల్లి స్టేషన్‌లో ఫిర్యాదు
- ఇద్దరి రిమాండ్

సిరిసిల్ల క్రైం: జిల్లాలో పలు ప్రాంతాల్లో జేసీబీతో భూమి చదును చేసే పనులు ఉన్నాయంటూ నమ్మబలికి డబ్బులు గుంజుతున్న ఇద్దరిని తంగళ్లపల్లి పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా బాలాపూర్‌కు చెందిన గోల్కొండ చందుకుమార్, చింతపట్టి అనే ఇద్దరు యువకులు జిల్లాలోని పలువురు జేసీబీ యజమానులకు ఫోన్ చేశారు. వేములవాడ సమీపంలోని అగ్రహారంలో కొత్తగా వెంచర్ వేస్తున్నారని.. అందులో చెట్లను చదును చేయడానికి జేసీబీ కావాలని కోరారు. ఎంట్రీ ఫీజు కోసం రూ.9వేలు ఇవ్వాల్సి ఉంటుందని నమ్మబలికారు. అంతేకాకుండా వారి ఫోన్‌లకు డబ్బులు స్కానర్ ద్వారా పంపించుకున్నారు. డబ్బులు పంపిన వారు పని కోసం ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయకపోవడంతో మోసపోయామని గ్రహించి తంగళ్లపల్లి ఠాణాలో ఫిర్యాదు చేశారు. వీరి బాధితులు ముస్తాబాద్ మండలం ఆవునూరులో ఇద్దరు, ఎల్లారెడ్డిపేట మండలం అగ్రహారంలో ఒకరు ఉన్నట్లు తెలిపారు.

కారు ఢీకొని డీసీఎం డ్రైవర్ మృతి

- ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు
- కేశంపేట బైపాస్ చౌరస్తాలో ప్రమాదం

షాద్‌నగర్ రూరల్: కారు ఢీకొన్న ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ మృతి చెందిన సంఘటన పట్టణ సమీపంలోని కేశంపేట బైపాస్ చౌరస్తాలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజేశ్వర్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. హైదరాబాద్‌లోని కిషన్‌బాగ్‌కు చెందిన డ్రైవర్ జావిద్‌అలీ (55) డీసీఎం తీసుకుని మహబూనగర్ నుంచి హైదబాద్‌వైపు వెళుతున్నాడు. డీసీఎంలోని సామాను దింపేందుకు షాద్‌నగర్ బైపాస్ వద్ద వాహనాన్ని ఆపి, కిందికి దిగి డీసీఎం వెనక వైపునకు వచ్చాడు. ఈ సమయంలో మహ్మద్ ఫసియొద్దీన్ కారులో మహబూబ్‌నుంచి హైదరాబాద్‌వైపు అతివేగంగా వెళ్తూ.. అదుపు తప్పడంతో ఆటోను ఢీ కొట్టాడు.



జావిద్‌అలీ మృతదేహం

అనంతరం డీసీఎం వెనక నిలబడి ఉన్న జావిద్‌అలీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో జావిద్‌అలీకి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో నడుపుతున్న నర్సింలు కాలు విరిగింది. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న ఎస్‌ఐ రాజేశ్వర్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వివరాలను తెలుసుకొని కుటుంబ సభ్యులకు తెలియచేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఆటో డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ కుమారుడు గౌతమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రాజేశ్వర్ తెలిపారు.